రేషన్ దుకాణాల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 6: రేషన్ షాపుల్లో అక్రమాలకు పాల్పడిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్ హెచ్చరించారు. మంగళవారం జిల్లాలోని రేషన్ డీలర్ల మండల అధ్యక్ష, కార్యదర్శులతో ఆమె ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రేషన్ షాపులలో ఈ కేవైసీని నెలాఖరులోగా వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. బినామీగా ఉన్న రేషన్ డీలర్లు స్వచ్ఛందంగా వైదొలగాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌరసర ఫరాలశాఖ అధికారి కె సురేశ్‌రెడ్డి, డీటీసీఎస్‌లు, అధికారులు పాల్గొన్నారు.

చెట్టుపై కూర్చొని..



కొమ్మ విరగడంతో దిగి పరుగెత్తుతూ..



మత్తుమందు ఇచ్చి పట్టుకుందాం..



చివరికి చిక్కింది..



పొలాల నుంచి బోను వద్దకు..



ఆపరేషన్ భల్లూకం

- మానకొండూర్‌లో ఎలుగుబంటి హల్‌చల్
- ఆందోళన చెందిన గ్రామస్థులు
- ఎట్టకేలకు బంధించిన అధికారులు

మంగళవారం.. తెల్లవారు జామున నాలుగు గంటల సమయం.. మానకొండూర్ చెరువు కట్ట వద్ద కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపైకి ఒక్కసారిగా ఓ ఎలుగుబంటి దూసుకొచ్చింది. అటువైపు వెళుతున్న ఓ కారు దానిని ఢీకొంది. దీంతో భయపడ్డ ఎలుగుబంటి రోడ్డు పక్కనున్న ఓ వేపచెట్టు ఎక్కి కూర్చుంది. ఊరకుక్కలు అరుస్తుండడంతో గ్రామస్థులు అక్కడికి వచ్చి చూడగా చెట్టుపై ఎలుగుబంటి కనిపించింది. దీంతో వారు పోలీసులకు సమాచారం అందించారు.

సీఐ రాజ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. జిల్లా అటవీ శాఖ అధికారి బాలమణి తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని గమనించి వరంగల్ అటవీశాఖ అధికారికి సమాచారం అందించారు. కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారి కావడంతో భారీ వాహనాల శబ్దంతో పాటు గ్రామస్థుల చేసే శబ్దాలకు ఎలుగుబంటి బెదిరింది. పలుసార్లు చెట్టు దిగేందు ప్రయత్నించింది. వరంగల్ నుంచి వచ్చిన రెస్క్యూ టీం చెట్టు కింద వలలు అమర్చారు. మత్తు మందు ఇచ్చే ప్రత్యేకాధికారి ప్రవీణ్‌కుమార్ సంఘటనా స్థలానికి వచ్చి ఇరువైపులా వాహనాలను నిలిపివేశారు. మత్తుమందు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తుండగానే ఎలుగుబంటి కూర్చున్న చెట్టు కొమ్మ విరిగిపోయింది. దీంతో కిందికి దిగిన ఎలుగుబంటి చెరువు పక్క నుంచి పరుగెత్తి సమీపంలోని ముళ్ల పొదల్లోకి దూరింది. పోలీసులు, అటవీ సిబ్బంది టపాసులు కాల్చడంతో మరికొంత దూరం వెళ్లి పొదల్లోకి వెళ్లింది. అటవీ శాఖ అధికారులు అక్కడికి వెళ్లి గన్ సహాయతో ఎలుగుబంటికి మత్తు మందు ఇచ్చారు. మత్తు మందు ఇచ్చిన తర్వాత అక్కడి నుంచి పరుగెత్తిన ఎలుగుబంటి ఓ పొలంలో పడిపోయింది. పోలీసులు, అటవీ సిబ్బంది, గ్రామస్థుల సహకారంతో ఎలుగుబంటిని బంధించి బోనులో బంధించి వరంగల్ తరలించారు.పది గంటలపాటు ముప్పుతిప్పలు పెట్టిన ఎలుగుబంటిని చివరకు బంధించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

◆ మానకొండూర్

కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

- పూర్తిస్థాయి రిజర్వేషన్ల కోసం బీసీ మేధావులు గళమెత్తాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 6: రాష్ట్రంలో కుల గణన పూర్తి చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్‌లో బీసీ కులాల ప్రతినిధులతో బీసీ హక్కుల సాధన కోసం భారత జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్తంగా నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రకటించిన బీసీ డిక్లరేషన్ మేరకు కులగణన ప్రక్రియను వెంటనే ప్రారంభించాలన్నారు. హడావుడిగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలనుకుంటే ఊరుకోబోమని హెచ్చరించారు. బీసీ సంక్షేమానికి 2024-25 బడ్జెట్‌లో 20 వేల కోట్లను కేటాయించాలని, అసెంబ్లీలో మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటుపై ఏప్రిల్ 11లోగా ప్రభుత్వం ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. యూపీఏ ప్రభుత్వం 4,500 కోట్లు ఖర్చుచేసి కులగణన చేపట్టినా సంబంధిత వివరాలను ప్రజల ముందు పెట్టలేదని విమర్శించారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాలన్నారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడిచినా ఈ దిశగా ముందడుగు వేయలేదని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తే కొత్తగా 24 వేల మంది బీసీలు ఎంపీటీసీలు, సర్పంచులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా, జడ్పీటీసీలుగా ఎన్నికవుతారని కాంగ్రెస్ పార్టీ చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. బీసీ సబ్‌ప్లాన్‌కి చట్టబద్ధత కల్పించాలని, ఎంబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రభుత్వాలకు రిజర్వేషన్లు ఇచ్చుకునే సౌలభ్యం కల్పించాలని ప్రతిపాదించారని గుర్తుచేశారు.



జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత

కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లను చేసుకునే అవకాశాన్ని రాష్ట్రాలకు ఇవ్వడం లేదని తప్పుబట్టారు. సుప్రీం తీర్పును చూపించి కేంద్రం రిజర్వేషన్ల విషయంలో తాత్సారం చేస్తోందని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లలో ఓబీసీ మహిళలకు కోటా కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. 2018 నుంచి ఇప్పటి వరకు 4,365 మంది సివిల్స్‌కు ఎంపికైతే అందులో 1195 మంది మాత్రమే బీసీ, ఎస్సీ, ఎస్టీలున్నారని తెలిపారు.

ఓబీసీలకు 27శాతం రిజర్వేషన్లు ఉన్నా 15.5 శాతం మందిని మాత్రమే ఎంపిక చేశారని ఆరోపించారు. ఎస్సీలు 5 శాతం, ఎస్టీల 3శాతం మాత్రమే ఎంపికయ్యారని, కోల్పోతున్న రిజర్వేషన్లపై బీసీ మేధావులు గళమెత్తాలని కవిత పిలుపునిచ్చారు. హక్కుల కోసం తెలంగాణ ఉద్యమం తరహాలో పోరాడాల్సిన అవసరముందన్నారు. ఉద్యమాలకు పెట్టిందిపేరైన కరీంనగర్ తెలంగాణ ఉద్యమంలో ముందుందని గుర్తు చేశారు. రౌండ్ టేబుల్ సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ మంత్రి జి రాజేశంగౌడ్, పూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రాంచందర్‌రావు, నాయకులు బొల్ల శివశంకర్, రాజారాంయాదవ్, గుంజ పడుగు హరిప్రసాద్, వారాల శ్రీనివాస్, భారత జాగృతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, జిల్లా అధ్యక్షుడు జాడి శ్రీనివాస్, కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ, గందె మాధవి పాల్గొన్నారు.

10 నుంచి ప్రజాహిత యాత్ర

- మేడిపల్లి నుంచి ప్రారంభం
- తొలి విడతలో 119 కిలోమీటర్ల మేర పర్యటించనున్న బండి సంజయ్



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

దక్షిణాది రాష్ట్రాల్లో పట్టు సాధించాలని బీజేపీ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోంది. రాష్ట్రంలో బీజేపీ అత్యధిక పార్లమెంట్ స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించింది. కరీంనగర్‌లో మళ్లీ విజయ సాధించేందుకు సిట్టింగ్ ఎంపీ, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ ప్రజాహిత యాత్ర పేరిట పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో పర్యటించాలని నిర్ణయించారు. తొలి విడతలో వేములవాడ, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గాలలో 119 కిలో మీటర్ల యాత్ర చేసేందుకు ఆయన రూట్ మ్యాప్ సిద్ధం చేసుకున్నారు.

అంజన్నకు పూజ చేసి..

10న కొండగట్టులో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మేడిపల్లి నుంచి సంజయ్ తన యాత్రను ప్రారంభించాలని నిర్ణయించుకున్నారు. 119 కిలోమీటర్ల ఈ యాత్రను సిరిసిల్ల జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న తంగళ్లపల్లిలో ముగింపు సభను నిర్వహించనున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడేలోగానే తన యాత్రను పూర్తి చేయాలని ఆయన నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మూడు రోజుల చొప్పున యాత్ర ఉండేలా రూట్‌మ్యాప్‌ను ఖరారు చేసుకున్నారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోని అన్ని మండలాలను చుట్టి వచ్చేలా, అత్యధిక సంఖ్యలో గ్రామాల్లోకి వెళ్లి ప్రజలతో మమేకం కావాలని, వారి సమస్యలను అడిగితెలుసుకొని పరిష్కారానికి కార్యాచరణ రూపొందించుకోవాలని ఈ యాత్ర నిర్వహిస్తు న్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభు త్వం గ్రామాలు, పట్టణాల అభివృద్ధి కోసం వెచ్చించిన నిధులను, అలాగే కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తారు. ప్రతి గ్రామంలో ఆ గ్రామానికి అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా అందిం చిన నిధుల వివరాలను తెలుపుతూ ఫ్లెక్సీలను, హోర్డింగ్ లను ప్రదర్శిం చేలా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కేంద్రం నుంచి వస్తున్న నిధులపై అవగాహన కల్పించనున్నారు. అన్ని మండలాలతోపాటు మున్సిపా లిటీలు కవర్ అయ్యేలా రూట్‌మ్యాప్‌ను రూపొందించు కుంటున్నారు. ఈనెల 10న తొలి విడత పాదయాత్రను కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో పూజలు నిర్వహించి మేడిపల్లి మండల కేంద్రం నుంచి ప్రారంభిస్తారు. అక్కడ నుంచి కొండాపూర్, రంగాపూర్, బీమారం, మన్నెగూడ, బొమ్మెన, దూలూరు, సిరికొండ, కథలాపూర్ గ్రామాల వరకు యాత్ర నిర్వహిస్తారు. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి వాహనాల్లో వెళుతూ గ్రామాల్లో ప్రజలందరిని కలుస్తూ పాదయాత్ర నిర్వహిస్తారు. నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఒక్కో నియోజకవర్గానికి మూడురోజుల చొప్పున విడతల వారీగా 21 రోజుల యాత్ర నిర్వహించాలని ఒక్కో విడతలో 100 కిలో మీటర్లకు తగ్గకుండా రూట్‌మ్యాప్ రూపొందించు కోవాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

> **ప్రజాహిత యాత్రతో తిరుగులేని శక్తిగా మారుతాం..**
>
> **- బండి సంజయ్‌కుమార్**
>
> గతంలో చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్ర విజయవంతంతో తెలంగాణలో బీజేపీ రూపురేఖలే మారిపోయాయి.. అదే తరహాలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో చేపడుతున్న ప్రజాహిత యాత్రతో నియోజకవర్గంలో బీజేపీ తిరుగులేని శక్తిగా ఆవిర్భవించబోతోంది. రాబోయే ఎన్నికల్లో ఎంపీ సీటుతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడం తథ్యం. రాష్ట్రంలో బీజేపీ పవనాలు వీస్తున్నాయి. 17 ఎంపీ స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ముందుకెళుతున్నాము.

మెజారిటీ పెంచుకునేలా..

గత పార్లమెంట్ ఎన్నికల్లో 90వేల పైచిలుకు మెజారితో గెలుచుకున్న కరీంనగర్ స్థానంలో ఈసారి భారీ మెజార్టీని సాధించి బీజేపీ కంచుకోటగా మార్చుకోవాలని భావిస్తునట్లు తెలిసింది. అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ జరగడంతో దేశవ్యాప్తంగా ఏర్పడిన సానుకూల వాతావరణంలో భాగంగా కరీంనగర్‌లోనూ బీజేపీ పట్టు గతం కంటే మెరుగైన పరిస్థితులు ఉన్నాయని ఆ పార్టీ నాయకత్వం భావిస్తున్నది. ఈ వాతావరణాన్ని మరింత సానుకూలంగా మార్చుకునేందుకు కేంద్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను కూడా ప్రజల వద్దకు చేర్చి వారు పొందుతున్న లబ్ధిలో మోదీ ప్రభుత్వ వాటా కూడా ఉందనే అవగాహన కల్పించాలని భావిస్తున్నారు. నియో జకవర్గంలోని నాలుగు లక్షల హిందూ కుటుంబాలకు అయోధ్యలోని శ్రీరామ చిత్రపటాలను పంపిణీ చేయనున్నారు.

నిజాయితీగా విధులు నిర్వహించాలి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 6: నిజాయితీగా విధులను నిర్వహించి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పమేలా సత్పతి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధుల్లో ఏ మాత్రం అలసత్వం, నిర్లక్ష్యం వహించవద్దన్నారు. గ్రామపంచాయతీ ప్రణాళికలు,పన్నుల వసూళ్లు, తాగునీటి సరఫరా, అనుమతులు తదితర అంశాలపై జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఈనెల 7 నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్‌ను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులను వచ్చే మార్చిలోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్డీవో శ్రీలత, డీపీవో వీరబుచ్చయ్య, డీఎంహెచ్‌వో లలితాదేవి, డీడబ్ల్యూవో సరస్వతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అమరేందర్ పాల్గొన్నారు.

● కరీంనగర్ ఫుడ్స్ పేరిట

స్వయం సహాయక సంఘాల తినుబండారాలు

కరీంనగర్ ఫుడ్స్ పేరిట జిల్లాలోని స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన తినుబండారాలు విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పీఎం స్వనిధి పథకం ద్వారా మున్సిపాలిటీల్లో వీధి విక్రయదారులకు రుణాలను అందిస్తామన్నారు. మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షెడ్‌ల వద్ద వారసంతలు నిర్వహించాలన్నారు.

దేశానికి దశ దిశ చూపేది ప్రధాని నరేంద్రమోదీ

- 17 ఎంపీ సీట్లను గెలవడమే లక్ష్యం
- ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 6: దేశానికి దశదిశ చూపే నాయకుడు నరేంద్ర మోదీ మాత్రమేనని ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం కరీంనగర్ 48, 58 డివిజన్లలో 30 లక్షల రూపాయల ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు సంజయ్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ సహా తెలంగాణలోని 17 ఎంపీ స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యంగా బీజేపీ పని చేస్తుందని అన్నారు. రాష్ట్రంలోని ప్రజలంతా పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటేస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందే నిర్ణయించుకున్నారన్నారు. గావ్ చలో అభియాన్‌లో భాగంగా ప్రతి నాయకుడు పల్లె నిద్ర చేయాలని సూచించారు. నగరా ల్లో బస్తీ నిద్ర చేయాలని, 24 గంటలపాటు ఆ గ్రామంలో బస్తీలో ఉండి ప్రజలతో, కార్యకర్తలతో మమేకం కావాలన్నారు. కార్య క్రమంలో కార్పొరేటర్ రాపర్తి విజయ, నాయకులు రాపర్తి ప్రసాద్, బండ రమణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎంపీ

● గ్యారెంటీ లేని ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉంది

హుజూరాబాద్‌రూరల్: గ్యారెంటీ లేని ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. మంగళవారం గావ్ చలో (పల్లె నిద్ర) అభియాన్ కార్యక్రమంలో భాగంగా హుజూరాబాద్ మండలం రంగాపూర్ గ్రామంలో బస చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకున్న లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అభివృద్ధి జరిగిందన్నారు. సాగు రంగంపై ఆధారపడి రైతులకు కిసాన్ సమ్మాన్‌తో చిన్న, సన్నకారు రైతులకు ఆదుకున్న ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. ప్రజల చిరకాల వాంఛ అయిన అయోధ్య రామాలయ నిర్మాణం నరేంద్రమోదీ హయంలో జరిగిందన్నారు. మరోసారి నరేంద్రమోదీ ప్రభుత్వం అజదికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అనంతరం మాజీ సర్పంచ్, బీజేపీ జిల్లా నాయకుడు బింగి కరుణాకర్ మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనులన్నీ కేంద్ర నిధులతోనే చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీకి ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. అనం తరం దళిత బస్తీలో భాగంగా సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, మండల అధ్యక్షుడు రాములకుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి వొడ్నాల విజయ్‌చంద్రిక, నాయకులు పల్నేని దేవేందర్‌రావు, వినయ్ పాల్గొన్నారు.



రంగాపూర్ గ్రామంలో కేంద్రప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 6: ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాశ్ అన్నారు. జిల్లా బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో పలు కుల సంఘాల అధ్యక్షులతో పీఎం విశ్వకర్మ పథకంపై అవగాహన సమావేశాన్ని మంగళ వారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ, ఎంఎస్ డీఈ, డీఎఫ్ఎస్, ఆర్థిక మం త్రిత్వ శాఖ ద్వారా పీఎం విశ్వకర్మ పథకం అమలు చేస్తారన్నారు. వచ్చే ఐదేళ్ల వరకు ఈ పథకం అమలులో ఉంటుందన్నారు. 18 కుల వృత్తుల వారికి పీఎం విశ్వకరమ్మ పథకం వర్తిస్తుందని తెలిపారు. పీఎం విశ్వకర్మ పథకంలో నమోదు చేసుకోవడానికి డిజిటల్ సేవ కేంద్రాల్లో ఆధార్‌కార్డుతో నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ నవీన్‌కుమార్, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

● 135 గ్రాముల బంగారం, నగదు స్వాధీనం

పెద్దపల్లిటౌన్, జనవరి 6: జల్సాలకు అలవాటుపడి సులవుగా డబ్బులు సంపాదించాలనే ఇద్దరు దొంగల ముఠాను మంగళవారం పెద్దపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందవర్భంగా ఏసీపీ ఎడ్ల మహేష్ వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా కుకుతుబుల్లాపూర్, భగత్ నగర్‌కు చెందిన మనిగండ్ల విజయ్‌కుమార్, భూపాల్‌పల్లి జిల్లా మొట్లపల్లికి చెందిన మిర్యాల రాజులు గతంలో దొంగతనాలకు పాల్పడి జైలు జీవితంలో పరిచయమయ్యారు. వీరిద్దరూ జనవరి 31న పెద్దపల్లి పట్టణంలోని టీచర్స్ కాలనీలో తమ వెంట తెచ్చుకున్న రించ్ స్పానర్‌తో ఓ ఇంటి తాళం పగులగొట్టి చొరబడగా ఆ ఇంటిలో ఖరీదైన వస్తువులు దొకకపోవడంతో పక్కనే ఉన్న ఎరవెల్లి వెణుగోపాల్‌రావు ఇంటి తాళం పగుల గొట్టి బంగారు, వెండి అభరణాలు దొరికినకాడికి దోచుకొని పారిపోయారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో దొంగల ఆచూకీ సేకరించారు. మంగళవారం పెద్దపల్లి బస్టాండ్ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుకున్నారు. తమదైన శైలిలో విచారణ చేపట్టారు. చేసిన దొంగతనాన్ని ఒప్పుకున్న దొంగల నుంచి 135 గ్రాముల బంగారం, లక్షా 40 వేల రూపాయల నగదు, మూడు సెల్ ఫోన్లు, ఒక బైక్, బంగారు అభరణాల లోన్ పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఏసీపీ తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ ఆర్ కృష్ణ, పెద్దపల్లి, ధార్మరం, బసంత్ నగర్ ఎస్సైలు మల్లేష్, సత్యనారాయణ, వెంకటేష్‌లతో పాటు సిబ్బందిని అభినందించారు.

నాలుగు ఇళ్లలో చోరీ

తంగళ్లపల్లి, ఫిబ్రవరి 6: తంగళ్లపల్లి మండలంలో నాలుగిళ్లల్లో చోరీ జరిగింది. బాధితుల కథనం ప్రకారం..గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి నాలుగు ఇళ్ల తాళాలు పగులగొట్టి రూ. 1.50 లక్షల నగదు, ఐదున్నర తులాల బంగారం, కిలో వెండి అభరణాలు ఎత్తుకెళ్లారు. తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేసుకుని తంగళ్లపల్లికి చెందిన కడమంచి లింగమూర్తి ఇంటి తాళం పగులగోట్టి 40 వేల నగదు, నాలుగు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. అలాగే మ్యాకల గంగారాం ఇంటి తాళాలు పగులగోట్టి బీరువాలో ఉన్న రూ. 60వేల నగదును దోచుకున్నారు. పక్కనే ఉన్నా మ్యాకల నర్సయ్య ఇంటి తాళాన్ని పగులగొట్టి వస్తువులను చిందర వందరగా చేశారు. అలాగే పద్మనగర్‌కు చెందిన పురోహితుడు పారునంది అంజనేయ శర్మ దంపతులు ఇంటికి తాళం వేసి ఊరువెళ్లగా తాళాలు పగులగొట్టిన దొంగలు రూ 50 వేల నగదు, తులం బంగారంతో పాటు కిలో వెండి అభరణాలను అపహరించినట్లు తెలిపారు. 48 గంటల్లో ఓబులాపూర్ గ్రామంతో పాటు తంగళ్లపల్లి, పద్మనగర్‌లలో ఏడు ఇళ్ల తాళాలు పగులగొట్టి దొంగతనాలు జరగడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సీరియస్‌గా తీసుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను రప్పించి దొంగల అచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు. చోరీ జరిగిన ఇళ్లను సీఐ సదన్‌కుమార్, ఎస్ఐ ప్రశాంత్‌లు పరిశీలించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

గంగాధర, ఫిబ్రవరి 6: మాయమాటలు చెప్పి ప్రయాణికురాలి రెండు తులాల బంగారు పుస్తెల తాడును దొంగిలించిన నిందితులను పట్టుకున్నట్లు చొప్పదండి సీఐ రవీందర్ తెలిపారు. మంగళవారం గంగాధర పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొడిమ్యాల మండలం నాచుపల్లికి చెందిన వృద్ధురాలు లక్ష్మి(60) గంగాధర మండలం గర్షకుర్తిలోని కూతురు ఇంటికి కొడిమ్యాల మండలం జేఎన్‌టీయూ రోడ్డు వద్ద ఆటో ఎక్కి వస్తుండగా ఆటో డ్రైవర్ రాజు, అతని భార్య పద్మావతి మాయమాటలతో పుస్తెలతాడు దొంగిలించినట్లు తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని 48 గంటల్లో నిందితులను గుర్తించి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. నేరస్తులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన గంగాధర ఎస్‌ఐ అభిలాష్, సిబ్బందిని అభినందించారు. నిందితుల నుంచి రెండు తులాల బంగారు ఆభరణాలను రికవరీ చేసినట్లు తెలిపారు.

ఆటో కిందపడి చిన్నారి మృతి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 6: కొత్తపల్లి మండలం చింతకుంటలో మంగళవారం ఉదయం ఒక ఆటో కిందపడి 16 నెలల చిన్నారి మృతి చెందిందని కొత్తపల్లి ఏఎస్‌ఐ మొగిలి పోచయ్య తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లికి చెందిన వేముల నూతనశ్రీ అనే చిన్నారిపై నుంచి ఆటో టైర్ ఎక్కటంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందిందని తెలిపారు. ఇంటర్‌నెట్ కేబుల్ లైన్ తవ్వేందుకు వచ్చిన కూలీలు చింతకుంటలో పనిచేస్తున్నారు. నీటిని సరఫరా చేస్తున్న అంజయ్యకు తన ఆటోను రివర్స్ తీస్తుండగా అక్కడే నూతనశ్రీ తన తల్లితో కలిసి ఉంది. ప్రమాదవశాత్తుగా ఆటోను చిన్నారిపై నుంచి తీయటంతో దుర్మరణం చెందిందని తెలిపారు. మృతురాలి తండ్రి ఆనంద్ ఫిర్యాదుతో చింతకుంటకు చెందిన ఆటో డ్రైవర్ అంజయ్యపై ఫిర్యాదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ మొగిలి పోచయ్య తెలిపారు.

మహాశివరాత్రి జాతరకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

● రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 6: మహాశివరాత్రి జాతర కోసం విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వచ్చే నెల 7, 8, 9వ తేదీల్లో వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానంలో నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై మంగళవారం ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో కలెక్టర్ అనురాగ్ జయంతి అధ్యక్షతన జాతర సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్సవాలను ఎలాంటి ఇబ్బంది లేకుండా నిర్వహించేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని దిశానిర్దేశం చేశారు. శివ స్వాములకు సులభ దర్శనం జరిగే విధంగా చూడాలని, దర్శన సమయం కూడా అరగంట అదనంగా పెంచాలన్నారు. పుర ప్రముఖులకు గతంలో మాదిరి బ్యాడ్జీలు అందజేసి సులభ దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రస్తుతం భక్తుల కోసం రెండు క్యూలైన్‌ల సిస్టం ఉన్న దృష్ట్యా వీఐపీల కోసం మూడో క్యూలైన్ శివరాత్రి లోగా ఏర్పాటు చేయాలని అన్నారు. బద్ది పోచమ్మ ఆలయం వద్ద భక్తులకు తాగునీరు, కుర్చీలు, పందిల్ల సౌకర్యం కల్పించాలని చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంతో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక బస్సుల సంఖ్యను పెంచాలన్నారు. బస్టాండ్‌లో మూత్రశాలలు, తాగునీరుకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. పారిశుధ్య సిబ్బందిని నియమించాలన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు శాశ్వత సీసీ కెమెరాలను పెట్టాలన్నారు. జాతర విజయవంతం చేయాలని కోరారు.



ఆలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న విప్ ఆదిశ్రీనివాస్

అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి

మహా శివరాత్రి జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, జాతర సమన్వయ కమిటీ చైర్మన్ అనురాగ్ జయంతి సూచించారు. భక్తులు స్వామి వారి దర్శనాన్ని వేగంగా, సౌకర్యంగా చేసుకునేలా ఏర్పాట్లు ముమ్మరంగా చేయాలని వివరించారు.

జాతరకు భారీ బందోబస్తు : ఎస్పీ అఖిల్ మహాజన్

మహా శివరాత్రి జాతర సందర్భంగా యాత్రికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జాతర సందర్భంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. వేములవాడలో కావాల్సిన సైన్ బోర్డ్, టోయింగ్ వాహనం, క్రేన్ అందుబాటులో ఉంచాలని ఆలయ ఈవోకు సూచించారు. ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా వలంటీర్‌లను ఏర్పాటు చేయాలని అన్నారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డి, ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్, వేములవాడ ఆర్డీవో మధుసూదన్, డీఎస్పీ నాగేంద్రచారి, తహసీల్దార్ మహేష్ ఉన్నారు.

వీఐపీ క్యూలైన్ కోసం ఏర్పాట్ల పరిశీలన

వేములవాడ : వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో వీఐపీ క్యూలైన్ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ అనురాగ్ జయంతి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న సమయంలో మూడో క్యూలైన్ ఉపయోగించడం వల్ల సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం త్వరగా లభించే అవకాశం ఉందని, ఇదే క్యూలైన్‌ను వీఐపీల బ్రేక్ దర్శనం కోసం నిర్దీత సమయాల్లో ఉపయోగించవచ్చని ఆది శ్రీనివాస్ సూచించారు. ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్‌తో పాటు ఇంజనీరింగ్ అధికారులకు వారు సూచించారు.

యువకుడి ఆత్మహత్య

మల్యాల, ఫిబ్రవరి 6: కొండగట్టుకు చెందిన ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నవేని(బండల్ల) అజయ్(18)అనే యువకుడు మంగళవారం తాను అద్దెకు ఉంటున్న ఇంట్లో ఉరి వేసుకున్నాడు. కొందరు గమనించి 108కు సమాచారం అందించడంతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే అజయ్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగానే మార్గమధ్యలో మృతి చెందాడు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రాజన్న క్షేత్రంలో తిరుమల తరహా వీఐపీ బ్రేక్

● ఉదయం, సాయంత్రం గంట చొప్పున దర్శనం

వేములవాడ, ఫిబ్రవరి 6: తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో అమలు చేస్తున్న తరహాలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలోనూ వీఐపీ బ్రేక్ దర్శనం సౌకర్యం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగిన మహాశివరాత్రి జాతర సమన్వయ కమిటీ సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. వీఐపీల రాక కారణంగా సామాన్య భక్తులకు దర్శనం నిలిపివేయడం వల్ల అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. ఈ పరిస్థితిని నివారించడానికి టీటీడీ తరహాలో వీఐపీ బ్రేక్ దర్శన విధానాన్ని ప్రవేశ పెట్టాలని ఆలయ అధికారులకు సూచించారు. ఉదయం వేళలో ఒక గంట, సాయంత్రం వేళలో ఒక గంట సమయం వీఐపీ బ్రేక్ దర్శనం కోసం కేటాయించాలని, ఇందుకోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. వీఐపీ బ్రేక్ దర్శనానికి సంబంధించిన సాధ్యాసాధ్యాలపై క్షేత్రస్థాయి అధ్యయనం చేసి వీలైతే శివరాత్రి జాతరలోగానే ఇందు కోసం తగిన ఏర్పాట్లు చేయాలని అన్నారు. వీఐపీ బ్రేక్ దర్శనం కోసం ప్రత్యేక సమయం కేటాయించడం వల్ల సాధారణ భక్తులకు దర్శన ఇబ్బందులను దూరం చేయవచ్చని ఆది శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ, ఫిబ్రవరి 6: రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ ఆలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. మేడారం సమ్మక్క సారక్క జాతరకు వెళ్లడానికి ముందు ఆనవాయితీ ప్రకారం సోమవారం తమ ఇష్టదైవమైన రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకున్న వేలాది మంది భక్తులు మంగళవారం బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే భక్తిశ్రద్ధలతో నైవేద్యం వండి బోనం తయారుచేసి ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని బద్దిపోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం చెల్లించేందుకు భారీ సంఖ్యలో జనం తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిసి పోయాయి. అమ్మవారి దర్శనానికి సుమారు రెండు గంటలకు పైగా సమయం పట్టింది.

సమ్మక్క భక్తులతో కిక్కిరిసిన అంజన్న క్షేత్రం



ఆలయం వద్ద భక్తుల రద్దీ



కొండపైన భక్తుల వాహనాలు

మల్యాల, ఫిబ్రవరి 6: కొండగట్టు అంజన్న క్షేత్రం మంగళవారం భక్తులతో పోటెత్తింది. వేలాదిగా తరలి వచ్చిన సమ్మక్క సారక్క భక్తులతో జనసంద్రంగా మారింది. మేడారంలో జరిగే సమ్మక్క సారక్క జాతర నేపథ్యంలో కొండగట్టు అంజన్నకు తొలి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు కొండగట్టుకు తరలి వస్తున్నారు. దాదాపుగా యాబై వేలకు వరకు భక్తులు అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం రాత్రికే కొండపైకి చేరుకున్న భక్తులు వేకు వజాము నుంచే స్వామి వారి దర్శనానికి బారులు తీరారు. ఆలయానికి వచ్చే మార్గాలు, కోనేరు పరిసరాలు భక్తులతో నిండిపోయాయి. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో వెంకటేష్, ఏఈవో వైరా గ్యం అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, పోలీసులు ఇతర అధికారులు పర్యవేక్షించారు. వందలాది వాహ నాలతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం నిండిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

భూ కబ్జా కేసులో మరొకరి అరెస్టు

● సీపీ కఠిన చర్యలతో కబ్జాదారుల్లో భయం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 6: భూకబ్జా కేసులో మంగళవారం కరీంనగర్ పోలీసులు మాజీ ఆర్టీఏ మెంబర్ తోట శ్రీపతిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. కరీంనగర్ శివారులోని వివేకానందపురి కాలనీకి చెందిన అనుమాండ్ల రవీందర్ 2014 మేలో తీగలగుట్టపల్లి రోడ్ నెంబరు 16 కార్తికేయనగర్‌లో 144 చదరపు గజాల ఇంటి స్థలం కొనుగోలు చేసి బేస్‌మెట్ నిర్మించుకుని 2023లో ఒక బోర్‌వెల్ కూడా వేసుకున్నాడు. ఇటీవలనే ఇంటి నిర్మాణం చేపడుతుండగా జనవరి 10న రాత్రి 10:30 గంటలకు పది మందికిపైగా అక్రమంగా చొరబడి 8 పిల్లర్లు, ఇతర నిర్మాణాలను కూల్చివేశారని బాధితుడు కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ విచారణ జరిపి ఈ ఘటనతో ప్రమేయం ఉన్న కరీంనగర్ చైతన్యపురి కాలనీకి చెందిన తోట శ్రీపతిరావు(50), పొన్నాల కనకయ్య, పవన్, సిరిపురం వెంకటరాజు, మరి కొందరిపై పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. అయితే కేసు నమోదైన విషయం తెలుసుకున్న శ్రీపతిరావు పరారీలో ఉండగా అతని గాలింపుకు ప్రత్యేకంగా ఒక టీంను ఏర్పాటు చేసి వెదుకుతుండగా సోమవారం అర్ధరాత్రి హైదరాబాద్ అంబర్‌పేట్‌లో అతని సోదరుడి ఇంటిలో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం కరీంనగర్‌కు తీసుకువచ్చి విచారణ అనంతరం సాయంత్రం శ్రీపతిరావును కరీంనగర్ అడిషనల్ ఫస్ట్‌క్లాస్ జుడీషియల్ కోర్టులో హాజరుపరిచారు. శ్రీపతిరావుకు 14 రోజుల రిమాండ్ విధిస్తూ జడ్జి ఆదేశాలు జారీ చేయగా పోలీసులు జైలుకు తరలించారు.

● భూకబ్జాలు, దౌర్జన్యాలు, డబ్బులు డిమాండ్, వేధింపులకు సంబంధించి బాధితుల ఫిర్యాదులతో నిందితులపై వరుసగా కేసులు నమోదు చేస్తూ, అరెస్టు చేసి జైలుకు తరలిస్తూ కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి కఠిన చర్యలు తీసుకుంటున్నారు. నెల రోజులుగా భూకబ్జాలు, మోసాలపై పోలీస్ కమిషనర్ దర్బార్‌ను నిర్వహిస్తుండగా ఇప్పటి వరకు 660 మంది బాధితుల నుంచి సీపీకి ఫిర్యాదులు అందాయి.

కేసుల భయంతో 8 ప్లాట్లు అప్పగింత

ఇటీవల పోలీస్ కమిషనర్ భూకబ్జాలపై ఉక్కుపాదం మోపి కేసులు, అరెస్టులు చేస్తుండటంతో భయపడి కరీంనగర్ మూడో ఠాణా పరిధిలోని ఒక ప్రజాప్రతినిధి గతంలో కబ్జా చేసిన స్థలాలను బాధితులను పిలిపించుకుని తిరిగి వారికి అప్పగించనట్లు తెలిసింది. అప్పటి అధికారపార్టీకి చెందిన సదరు ప్రజాప్రతినిధి భూ వివాదంలో తలదూర్చి న్యాయం చేస్తానని చెప్పి చివరకు ఆ స్థలంలో ప్రహరీగోడను నిర్మించి తన ఆధీనంలో పెట్టుకున్నాడని, ఆ తరువాత ఇంటినెంబర్లు వేసి, షెడ్ కూడా నిర్మించినట్లు తెలిసింది. బాధితులు సీపీని ఆశ్రయించేందుకు ప్రయత్నిస్తుండగా విషయం తెలుసుకుని బాధితులను పిలిపించుకుని వారి స్థలాలను వారికే అప్పగించినట్లు సమాచారం. దీనిపై కూడా స్పెషల్‌టీం పోలీసులు ఆరాతీస్తున్నట్లు తెలిసింది. వ్యక్తిగత ఆర్థిక లావాదేవీలు, భూ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు కూడా వెల్లువెత్తుతుండటంతో ఆయా పరిధిలోని పోలీసు ఠాణాల ఎస్‌హెచ్‌ఓలకు అప్పగించి విచారణ జరపాలని సీపీ ఆదేశిస్తున్నారు. భూకబ్జాలు, డబ్బులు మోసాలకు సంబంధించి పెద్ద తలకాయల పాత్ర ఉన్న కేసులను నేరుగా సీపీ మానిటరింగ్ చేస్తూ దర్యాప్తు అధికారులకు ఎప్పటికప్పుడు తగిన సూచనలు, ఆదేశాలు జారీ చేస్తూ కేసుల దర్యాప్తును పకడ్బంధీగా నిర్వహిస్తున్నారు.

కుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 6: మండలంలోని అనంతగిరి గ్రామంలో కుక్క దాడిలో ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామస్థుల వివరాల ప్రకారం మంగళవారం ఇంటి బయట ఆడుకుంటున్న పబ్బతి మనోజ్ఞ, పబ్బతి ప్రసన్న, జుట్టు బాలయ్యలను కుక్క కరిచింది. చికిత్స నిమిత్త వీరిని ఆస్పత్రికి తరలించారు.

సీఐల బదిలీ

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 6 : కమిషనరేట్‌లోని పలువురు సీఐల బదిలీలు జరిగాయి. ఈ మేరకు మల్టీజోన్ ఐజీ ఉత్త ర్వులు జారీ చేశారు. చొప్పదండిలో పనిచేస్తున్న సీఐ గోపతి రవీందర్‌కరీంనగర్ టాస్క్‌ఫోర్స్-2 సీఐగా బదిలీ చేశారు. మెదక్ సీసీఎస్- సీఐగా పనిచేస్తున్న ఆర్ ప్రకాశ్‌గౌడ్‌ను చొప్పదండి సీఐగా నియామకం చేశారు. సీఐడీలో పనిచేస్తున్న సీఐ పి విజయ్‌కుమార్‌ను కరీంనగర్ పోలీస్‌కంట్రోల్‌రూంకు, పోలీస్ కంట్రోల్‌రూంలో సీఐగా పనిచేస్తున్న విజ్ఞాన్‌రావు, జమ్మికుంట సీఐ బార్పాటి రమేష్‌లను ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి



నృత్యాలు చేస్తున్న వాగేశ్వరి కళాశాల విద్యార్థినులు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 6: విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలని శాతవాహన యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డా.శ్రీరంగప్రసాద్ సూచించారు. వాగేశ్వరి డిగ్రీ, పీజీ ఉమెన్స్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు అద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. నగర శివారులోని ఎస్వీఆర్ గార్డెన్ లో మంగళవారం విద్యార్థులు వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శాతవాహన యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డా.శ్రీరంగప్రసాద్, వాగేశ్వరి డిగ్రీ, పీజీ విద్యాసంస్థల అధినేత బి. వేణుగోపాలరెడ్డి తో కలసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ బి.వి.ఆర్ గోపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ డాక్టర్ రత్నగోపాల్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పత్తి వెంకటరెడ్డి, సతీష్, పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ లింగమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ రమణ, చైతన్య, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ నిజాముద్దీన్, వేదవాసి రెడ్డి పాల్గొన్నారు.

'ఉద్యమకారులను మోసం చేసిన వినోద్‌కుమార్'

సుభాష్‌నగర్, జనవరి 6: ఉద్యమకారులను మోసం చేసిన మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌ను ఓడిస్తామని ఉద్యమకారుల ఫోరం జిల్లా ఛైర్మన్ కనకం కుమారస్వామి అన్నారు. మంగళవారం నగరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తరువాత ఉద్యమకారులను గుర్తించకపోవడం బాధాకరమన్నారు. వినోద్‌కుమార్ వెంట నడిచిన ప్రతి ఉద్యమకారుని పరిస్థితి దయనీయంగా ఉందన్నారు.

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండడంతో, మరోసారి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని ఆరోపించారు. పది సంవత్సరాలలో ఉద్యమకారులు అనేక సార్లు వినోద్‌కుమార్ వద్దకు వెళ్ళి ఉద్యకారుల సంక్షేమం గురించి వినతి పత్రాలు అందచేసినా ఫలితం లేదన్నారు. సమావేశంలో బోగె పద్మ, శరత్, జంపన్న, సాగర్, సదానందం, శంకర్, మల్లేశం, మొగిలి, వెంకన్న, శ్రీనివాస్, ప్రసాద్, సురేశ్, పోశెట్టి, మున్న, ఎల్లయ్య, మారుతి, శ్రీను, వెంకటేశం, కర్ణాకర్‌రెడ్డి, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 6 : కరీంనగర్ శివారులోని ఆటోనగర్‌లో పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. పట్టుబడివారి వద్ద నుంచి 8,200 రూపాయలను స్వాధీనం చేసుకున్నామని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు.

● ఒకటో ఠాణా పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిషేధిత గంజాయిని పట్టుకున్నారు. మంగళవారం గంజాయిని పట్టుకుని ఒకటో ఠాణా పోలీసులకు అప్పగించారు.

'సీఎంపై బాల్క సుమన్ వ్యాఖ్యలు సరికాదు'

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 6: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఉమ్మడి జిల్లా రెడ్డి సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తిని పరుష పదజాలంతో దూషించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆయన వాఖ్యలను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఇతర రాష్ట్ర నాయకులెవరు ఖండించకపోవడం, అతనిపై చర్యలు తీసుకోక పోవడం బాధాకరమన్నారు.

అతనిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, ముఖ్యమంత్రికి పత్రికా ముఖంగా క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో రెడ్డి సామాజిక వర్గం మొత్తం బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పనిచేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా రెడ్డి సంఘం నాయకులు నరహరి జగ్గారెడ్డి, వంచ సుదర్శన్‌రెడ్డి, పెండ్యాల రాంరెడ్డి, కాసర్ల మధూకర్‌రెడ్డి, బండ గోపాల్‌రెడ్డి, సంది తిరుపతిరెడ్డి, రేకులపెల్లి రవీందర్‌రెడ్డి, జున్నూతల రాజిరెడ్డి, దారం జగన్నాథరెడ్డి, రావుల కిరణ్‌రెడ్డి, చింతల శ్రీనివాస్‌రెడ్డి, గన్ను మహేశ్‌రెడ్డి, ద్వావ భాస్కర్‌రెడ్డి, కాంతాల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

●వీణవంక ఫిబ్రవరి6: రెడ్డి సామాజిక వర్గం ముఖ్యమంత్రి అయితే బీఆర్ఎస్ నాయకులు తట్టుకోలేక పోతున్నారని, సీఎం రేవంత్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వ్యాఖ్యలు సరికావదని రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నల్ల కొండాల్‌రెడ్డి అన్నారు. విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ దొరలకు ఊడిగం చేసిన బాల్క సుమన్ రాష్ట్ర ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాక్యలు చేయ డం సిగ్గుచేటు అని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో తగిన గుణ పాఠం చెపుతామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు పత్తి సమ్మిరెడ్డి, పోరెడ్డి తిరుపతిరెడ్డి, నల్ల కొండాల్ రెడ్డి, సంది సురేందర్‌రెడ్డి, పోరెడ్డి తిరుపతి రెడ్డి, రామ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మేడారం జాతర ఏర్పాట్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం'

హుజూరాబాద్, ఫిబ్రవరి 6: ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారం జాతర ఏర్పాట్లలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేష్ మంగళవారం ఒక ప్రకటన జారీ చేశారు. జాతర పనుల్లో నాణ్యత పాటించాలని పేర్కొన్నారు. కాకతీయ రాజులు ఆది వాసుల వద్ద అధిక మొత్తంలో పన్నులు విధించి, వాటిని వసూళ్ల చేయడంలో ఒత్తిడి తేవడంతో సమ్మక్క-సారలమ్మ తిరుగుబాటు చేశారన్నారు. జాతరకు వచ్చే ఆదాయాన్ని ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధికి వెచ్చించాలన్నారు. గత ప్రభుత్వాలు మేడారం జాతర ఆదాయాన్ని దారి మళ్లించారన్నారు. జాతర ఏర్పాట్ల విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆదివాసీల సంప్రదాయమైన బెల్లం మాత్రమే ప్రసాదంగా ఇవ్వాలన్నారు. జాతర పూర్తయిన తర్వాత పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

దళితబంధు రెండో విడత విడుదల చేయాలి

● హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

జమ్మికుంట, ఫిబ్రవరి 6: హుజూరాబాద్ నియోజకవర్గంలో దళిత బంధు రెండో విడత వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. జమ్మికుంట పట్టణంలో దళితబంధు రెండవ విడుత రావడం లేదని మనస్థాపానికి గురై ఇటీవల ఆత్మహత్య యత్నానికి పాల్పడిన శ్రీనివాస్‌ను మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్ట్ కింద హుజూరాబాద్‌లో కేసీఆర్ దళితబంధు ప్రారంభించారని, 18వేల పైచిలుకు కుటుంబాలకు వారి ఖాతాల్లో పది లక్షల రూపాయలు వేయడం జరిగిందన్నారు. వారిలో 14వేల కుటుంబాలకు పది లక్షల రూపాయలు అందాయని, మరో 4వేల కుటుంబాలకు రెండవ విడుత రావాల్సి ఉందన్నారు.

ఫ్రీజ్‌లో పెట్టిన ఖాతాల్లోని డబ్బులు లబ్ధిదారులకు వెంటనే అందజేయాలన్నారు. కలెక్టర్ రివ్యూ మీటింగ్‌లో సమస్యను ఇన్‌ఛార్జి మంత్రి దృష్టికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు. ఆనంతరం జమ్మికుంటలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను ఆయన పరామర్శిం చారు. కార్యక్రమంలో పాడి కౌశిక్‌రెడ్డి సతీమణి షాలినిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, వైస్ చైర్మన్ దేశిని స్వప్న-కోటి, పీఏసీఎస్ చైర్మన్ పొన గంటి సంపత్, పట్టణ అధ్యక్షులు టంగుటూరి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి

జమ్మికుంట, ఫిబ్రవరి 6: హుజూరాబాద్ నియోజకవర్గంలో దళితబంధు లబ్ధిదారుల ఖాతాల్లో ఉన్న రెండవ విడుత డబ్బులు వెంటనే విడుదల చేయాలని భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి రాజేష్ ఠాకూర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

వీణవంక ఫిబ్రవరి6: మండలంలోని చల్లూరులో కాసారపు శ్రీనివాస్, ఊటిది నరేష్‌లు పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ప్రజల నుంచి నేరుగా కొనుగోలు చేసి కోళ్ల దాణాకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న టాటా ఏస్ వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ నిరసన

-జిల్లావ్యాప్తంగా ఠాణాల్లో ఫిర్యాదులు, దిష్టిబొమ్మల దహనం



కరీంనగర్, జమ్మికుంటలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 6: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై నగరంలోని కాంగ్రెస్‌పార్టీ నాయకులు భగ్గుమన్నారు. బాల్క సుమన్‌పై ఠాణా లలో ఫిర్యాదులు, దిష్టిబొమ్మ దహనం చేశారు.

●బాల్క సుమన్ మతి భ్రమించి నట్లుగా వ్యవహరిస్తున్నాడని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్య నారాయణ ఒక ప్రకటనలో విమర్శించారు.

●కాంగ్రెస్ నాయకులపై మరొకసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే నాలుకతెగకోస్తామని డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన మంగళవారం ఓ హోటల్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మడుపు మోహన్, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంఘాల అధ్యక్షులు పులి ఆంజనేయులుగౌడ్, ఎండి తాజ్, కొరివి అరుణ్‌కుమార్, శ్రావణ్‌నాయక్, యూత్ కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ అధ్య క్షులు అబ్దుల్ రెహమాన్, నగర కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షులు లింగంపెల్లి బాబు, నాయకులు పాల్గొన్నారు.

●సీఎంపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన తీవ్ర వ్యాఖ్యలను మాజీ టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ములకల ప్రవీన్ తీవ్రంగా ఖండించారు.

●కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్, నగర అధ్యక్షుడు లింగంపల్లి బాబుల ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాచౌక్‌లో బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు

●బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్‌కుమార్, లింగంపల్లి బాబుల ఆధ్వర్యంలో రెండో ఠాణా ఎస్‌ఐకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎండీ తాజొద్దీన్, అబ్బుల్ రహమాన్, శ్రీనివాస్‌రెడ్డి, రాంచందర్, అఖిల్, కుర్ర పోచయ్య, శంకర్, రమేష్, ప్రసాద్ తదితరులున్నారు.

-బాల్కసుమన్‌పై చర్యలు తీసుకోవాలని కొత్తపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు పంజాల స్వామిగౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మంగళవారం కొత్తపల్లి ఠాణాలో ఫిర్యా దు చేశాడు.

●మాజీ గ్రంథాలయ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి తన అనుచరులతో కలిసి సోమవారం ఇందిరాచౌక్‌లో సీఎంను దూషిస్తూ సీఎం దిష్టిబొమ్మను దహనం చేసి గౌరవాన్ని దెబ్బతీశారని కాంగ్రెస్ నాయకులు జంగలపల్లి కుమార్ ఒకటో ఠాణా సీఐకి ఫిర్యాదు చేశారు.

●గణేశ్‌నగర్: తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణచౌక్‌లో మంగళ వారం బాల్కసుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్, రాష్ట్ర ప్లానింగ్ కమిటీ అధ్యక్షులు గజ్జల ఆనంద్ రావు మీసాల సాయిలు, దళిత నాయకులు గోస్కి శంకర్, సాయిలు, జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిపెల్లి కృష్ణ పాల్గొన్నారు.

●హుజూరాబాద్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కొల్లూరి కిరణ్, సుశీల, విజేందర్, ఎండీ అఫ్జర్, కుర్ర శ్రీనివాస్, మిడిదొడ్డి రాజు, రవీందర్, సంపత్, రమేష్, కిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

●శంకరపట్నం: మండల కేంద్రంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు బొజ్జ చంద్రమౌళి ఆధ్వర్యంలో బాల్క సుమన్ చిత్రపటానికి చెప్పులు, చీపురు దండ వేసి చెట్టుకు ఉరి తీశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, నాయకులు గరిగే ప్రభాకర్, మహ్మద్ షారుక్, రాజిరెడ్డి, సదానందం, కిష్టయ్య, సంపత్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

●వీణవంక: మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు ఎస్సై వంశీకృష్ణకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మాదాసి సునీల్, నాయకులు నల్ల కొండాల్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, పోరెడ్డి తిరుపతి రెడ్డి,ప్రసాద్, లక్ష్మణ్, గోపాల్‌రెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●జమ్మికుంట రూరల్: కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సుంకరి రమేష్ ఆధ్వర్యంలో గాంధీ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎగ్గని శ్రీనివాస్, ఎండి సలీం పాల్గొన్నారు.

●ముఖ్యమంత్రిపై ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు రమేష్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.

●చొప్పదండి: చొప్పదండిలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముద్దం తిరుపతి గౌడ్, నాయకులు పురం రాజేశం. కొట్టె అశోక్, పెరుమాండ్ల గంగయ్య, ముద్దసాని రంగన్న, నిజానపురం చందు కార్యకర్తలు పాల్గొన్నారు.

●మానకొండూర్: బాల్క సుమన్ దిష్టిబొమ్మను మానకొండూర్‌లో కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు కనకం అశోక్, మండల అధ్యక్షులు రవీందరాచారి, తాళ్లపల్లి సంపత్‌గౌడ్, ఎండీ ఇర్ఫాన్, చలిగంటి సంపత్, జడల రమేశ్ నాయకులు ఉన్నారు.

కుల గణన చేయాలని ధర్నా

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 6: కులగణన చేయాలని పార్లమెంటు వద్ద భారీ ధర్నా దద్దరిల్లిన జంతర్ మంతర్ ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద బీసీల మహాధర్నా కార్యక్రమంలో జిల్లా బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్, బీసీ సంక్షేమ సంఘం మహిళ అధ్యక్షురాలు గుంటి స్వరూప, ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్య క్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలో బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనిల్, కాట వేణుగోపాల్, పెద్ది శ్రీనివాస్ కొక్కర్ల రేణుక,కొక్కెర రజిత, విద్యార్థి సంఘం జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 6: తన స్థలాన్ని కబ్జా చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా, మంథని మండలం దుబ్బపల్లెకు చెందిన పెద్దపల్లి మహదేవ్ కోరారు. మంగళవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. 2005లో నగరంలోని గౌతమినగర్‌లో గాదె భాస్కర్‌రావు నుంచి స్థలాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆనాటి నుంచి ఆ స్థలం ఖాళీగా ఉందని, రెండు సంవత్సరాల క్రితం బెస్‌మెంట్ నిర్మించి చుట్టు గోడకట్టుకున్నానని తెలిపారు. కొందరు వ్యక్తులు గోడను కూల్చి తన భూమిలోకి వచ్చారని ఆరోపించారు. అంతేకాకుండా తనను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

'బీఆర్ఎస్ భూకబ్జాలకు సూత్రదారి గంగుల కాదా?'



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 6: బీఆర్ఎస్ నేతలు చేసిన భూ కబ్జాలకు పాత్రదారి సూత్రదారి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కాదా అని బీజేపీ నాయకుడు బేతి మహేందర్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం నగరంలోని ప్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరీంనగర్‌లో భూముల రేట్లు ఆకాశాన్ని అంటడంతో బీఆర్ఎస్ ప్రభుత్వ అండదండలతో ఆ పార్టీ నాయకులు గత పదేళ్ళుగా అధికారం ముసుగులో సామాన్యులకు చెందిన ప్రైవేటు భూములతో పాటు ప్రభుత్వ భూములను విచ్చలవిడిగా కబ్జా చేశారని ఆరోపించారు. భూ కబ్జాలను అరికట్టాల్సిన నాటి, నేటి ఎమ్మెల్యే గంగుల కమలాకర్ వారికే వంతపాడారని ఆరోపించారు. కరీంనగర్‌లో అనేక ఏళ్ళుగా భూకబ్జాలకు సమస్యకు పరిష్కారంగా పోలీసు కమీషనర్ అభిషేక్ మొహంతి రూపంలో రావడం ఆనందకరమన్నారు. కలెక్టర్ విలీన గ్రామాలైన పద్మనగర్, రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, వల్లంపాడ్, సదాశివపల్లి, నుస్తులాపూర్‌లతో పాటు కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్, కొత్తపల్లి మున్సిపాలిటీ, కొత్తపల్లి మండల పరిధిలోని గ్రామాలలోని ప్రభుత్వ ప్రైవేటు, అసైన్డ్, సీలింగ్ భూములను పరిరక్షించడానికి నిజాయితీ గల అధికారితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బిజేవైఎం మాజి జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపాటి జితేందర్‌రెడ్డి, దళిత మోర్చా మాజీ జిల్లా కార్యదర్శి జెడి భగవాన్, మాజీ నగర ఉపాధ్యక్షుడు వడ్డెపల్లి సుమన్, కామారపు నరహరి, ఉప్పులేటి లక్ష్మన్, పెండ్యాల రాంరెడ్డి, మన్నే శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుదాం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

చిగురుమామిడి, ఫిబ్రవరి 6: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన చిగురుమామిడిలో జరిగిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ మంజూరు చేసిన నిధులతోనే నియోజక వర్గంలోని అభివృద్ధి పనులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతయుతంగా మాట్లాడాలని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాకపోతే రాజీనామా చేస్తారా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం కంకణబద్ధులం కావాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మామిడి అంజయ్య, ఎంపీపీ కొత్త వినీత, వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి, సింగిల్ విండో చైర్మెన్ జంగ వెంకటరమణారెడ్డి, వైస్ చైర్మెన్ కరివేద మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సాంబారి కొంరయ్య, మంకు శ్రీనివాస్‌రెడ్డి, రామోజు కృష్ణమాచారి, అందె సుజాత, భవాని, మల్లేశం, స్వప్న, జమున, దుడ్డెల లక్ష్మీనారాయణ, వెంకటేశం తదితరులున్నారు.

రెండో విడత దళితబంధు డబ్బులు ఇప్పించేందుకు కృషి : ప్రణవ్

హుజూరాబాద్, ఫిబ్రవరి 6: హుజూరాబాద్ నియోజక వర్గంలోని దళితబంధు లబ్ధిదారులకు రెండో విడత డబ్బులు ఇప్పించేందుకు కృషి చేస్తానని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దళితబంధు పథకంలో రెండో విడత నిధుల మంజూరు విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం జాప్యం చేసిందన్నారు. దళితబంధు డబ్బుల విషయంలో ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. బీఆర్ఎస్ నాయకుల మాయ మాటలను లబ్ధిదారులు నమ్మవద్దన్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్‌తో ఈ విషయంపై మాట్లాడినట్లు పేర్కొన్నారు.

విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే

రామడుగు, ఫిబ్రవరి 6: కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో జరిగిన ఇండో నేపాల్ కరాటే పోటీలో మండలంలోని కొక్కెరకుంట గ్రామానికి చెందిన విశ్వాంత్‌రెడ్డి అనే విద్యార్థి బంగారు పథకం సాధించాడు. విద్యార్థిని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అభినందించారు. కార్యక్రమంలో జువ్వాజి హరీష్, శ్రీనివాస్ రెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని సర్పంచ్‌ల నిరసన

గంగాధర, ఫిబ్రవరి 6: అప్పులు చేసి గ్రామాల అభివృద్ధి చేశాము, తమకు రావాల్సిన బిల్లులు చెల్లించాలని సర్పంచ్‌లు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం గంగాధర ఎంపీడీవో కార్యాలయం ఎదుట సర్పంచ్‌లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి చిన్న గ్రామపంచాయతీలు 10 లక్షల నుంచి పెద్ద గ్రామ పంచాయతీలకు 25 లక్షల వరకు చేసిన బిల్లులు రావాల్సి ఉందన్నారు. గత నెల 20న 15 ఆర్థిక సంఘనిధులు పంచాయతీల్లో జమచేశారు. కనీసం అధికారులు వాటినైనా సర్పంచులకు చెల్లిస్తే గౌరవం ఉంటుందన్నారు. ఈ ప్రభుత్వంపై సర్పంచ్‌లు పూర్తి నమ్మకంతో ఉన్నారని ప్రభుత్వం పట్టించుకుని అప్పులు చేసి గ్రామాల అభివృద్ధికి వెచ్చించిన బిల్లులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రూ.6,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 6: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.6,600 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు 93మంది రైతులు 813 క్వింటాళ్ల విడి పత్తి, 16మంది రైతులు 22 క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,600, కనిష్ఠ ధర రూ.5వేలతో కొనుగోలు చేశారు.

విద్యార్థుల హర్షం

చొప్పదండి, ఫిబ్రవరి 6: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తన మొదటి నెల వేతనాన్ని తమ స్నాక్స్ కోసం అందించడం పట్ల చొప్పదండి, కాట్నపల్లి జడ్పీ పాఠశాలల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు విద్యార్థులు దన్యవాదాలు తెలిపారు. లక్షా యాభై వేల రూపాయలను తమకు అల్పాహారంగా అందించడం చాలా సంతోషంగా ఉందని విద్యార్థులు అన్నారు.

సీఎంకు బాల్క సుమన్ క్షమాపణ చెప్పాలి



హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న దొంత రమేష్

హుజూరాబాద్, ఫిబ్రవరి 6: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని టీపీసీసీ మాజీ ఎస్సీ సెల్ జాయింట్ కన్వీనర్ దొంత రమేష్ అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీలో రబ్బరు చెప్పులతో తిరిగిన బాల్క సుమన్‌కు వందల కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. బాల్క సుమన్ అక్రమ సంపాదనతో చెన్నూర్ ప్రజలు చెల్లని రూపాయి, బానిస సుమన్ అని ఓడగొట్టారన్నారు. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్ర మంత్రులను దూషించినప్పుడు బాల్క సుమన్ ఎందుకు మాట్లాడలేదన్నారు. సమావేశంలో కొల్లూరి కిరణ్, టీఆర్ గౌడ్, చందమల్ల బాబు, టేకుల శ్రావణ్, దుబాసి బాబు, మిడిదొడ్డి రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 6: నగరంలో బుధవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ వన్ ఏడిఈ సాయినేనీ నరేందర్ తెలిపారు. లక్ష్మీ నగర్, గాయత్రి నగర్, మధు తోట ప్రాంతం, పోచమ్మ వాడ, బ్యాంక్ కాలనీ, రెడ్డి ఫంక్షనల్ హాల్, హన్మాన్ దేవాలయం ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి6: కరీంనగర్ కోతిరాంపూర్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మానకొండూర్ మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన ఠాకూర్ మహేందర్ సింగ్(64) మృతి చెందాడని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. ఠాకూర్ మహేందర్‌సింగ్ కరీంనగర్‌లో ప్రైవేట్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధులకు హాజరై తిరిగి రాఘవాపూర్‌కు తన బైక్‌పై వెళ్తుండగా కోతిరాంపూర్‌లో వెనుకవైపు నుంచి గుర్తుతెలియని ఆటో ఢీకొట్టినట్లు తెలిపారు. తలకు గాయాలు కాగా అతని కొడుకు ఇంటికి తీసుకువెళ్లిన అనంతరం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా సాయంత్రం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి కొడుకు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉపకార వేతనాల గడువు పొడిగింపు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి6: పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్‌లకు 2023-24, సంవత్సరానికి వివిధ జూనియర్, డిగ్రీ కాలేజీ ఇంజనీరింగ్ మెడికల్ అండ్ పారా మెడికల్ వివిధ సాంకేతిక రంగాలలో చదువుతున్న మైనారిటీస్ విద్యార్థులకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకొనుటకు మార్చి31,2024, వరకు గడువు పొడిగించడం జరిగింది. కావున అర్హత గల మైనారిటీస్ విద్యార్థులు ఆన్లైన్ లో (టీటీట్స్‌ట్బఇట్టఊ) యందు దరఖాస్తు చేసుకోగలరని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖాధికారి తెలిపారు.

మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ సస్పెన్షన్

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 6: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కలెక్టర్ పమేలా సత్పతి నగరపాలక సంస్థ శానిటరీ సూపర్‌వైజర్ రాజమనోహర్ గౌడ్‌ను సస్పెండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ట్రేడ్ లైసెన్సు జారీ సమాచార మివ్వడం, ఫిర్యాదులపై స్పందించక పోవడం తదితర కారణా లను చూపుతూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తున్నందున సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు తెలిసింది. శానిటరీ సూపర్‌వైజర్ బాధ్యతలను తాత్కాలికంగా అసిస్టెంట్ కమిషనర్ నరేశ్‌బాబుకు అప్పగించినట్లు సమాచారం.

పాఠశాలలో పండ్లు పంపిణీ

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 6: లయన్స్ క్లబ్ గుంటూరుపల్లి ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రభుత్వ యూపీఎస్ పాఠశాలలో మంగళవారం డిస్ట్రిక్ 320 జి కేబినెట్ సెక్రెటరీ మంద రమణారెడ్డి-రజిత దంపతుల వివాహ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పండ్లు, బ్రెడ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేద్దాం

భగత్‌నగర్, ఫిబ్రవరి 6: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, వ్యవసాయ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న చేపట్టిన దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ముకుందలాల్‌మిశ్ర భవన్‌లో సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక చట్టాను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. దాని వల్ల కార్మికల్లో నిజవేతనాలు పడిపోయాయని అన్నారు. నిరుద్యోగం పెరిగిందని, ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మడం, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు స్కీం వర్కర్లకు పని భద్రత లేకుండా పోయిందన్నారు. కార్మిక హక్కులను యాజమాన్యాలకు అనుకూలంగా మార్చడం వల్ల పెద్దపెద్ద కార్పోరేట్ సంస్థలకు లబ్ది జరుగుతుందన్నారు. కార్మికుడికి ఒక రోజుకు 178 రూపాయలు వేతనం ఇవ్వాలని నిర్ణయం చేసిందని తెలిపారు. కార్పోరేట్ సంస్థలకు 2లక్షల 14కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జి సత్యం, యు శ్రీనివాస్, జనగాం రాజమల్లు, జిల్లా సహాయకార్యదర్శి కొప్పుల శంకర్, పున్నం రవి, జిల్లా కమిటి సభ్యులు జెఎల్ నరసింహరెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ కళాశాల అధ్యాపకులకు డాక్టరేట్

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 6: ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకుడిగా పనిచేస్తున్న సిహెచ్ మారుతికి ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'మిస్టరీ అండ్ సస్పెన్స్ ఇన్ ద సెలెక్టెడ్ వర్క్స్ఆఫ్ కట్ వానిగాట్ జూనియర్ ఏ పోస్ట్ మాడర్నిస్ట్ స్టడీ' అనే అంశంపై వీరు ప్రొఫెసర్ ఏ. కరుణాకర్ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, అండ్ సైన్స్ కళాశాలలో ఆంగ్ల విభాగ అధ్యాపకుడిగా పనిచేస్తున్న జి రామకృష్ణకు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది 'ఏకో కన్సర్న్స్ ఇన్ సెలెక్టెడ్ అమెరికన్ ఫిక్షన్' అనే అంశంపై వీరు ప్రొఫెసర్ బి.విజయ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. వీరిని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.రామకృష్ణ, డాక్టర్ కే.సురేందర్‌రెడ్డి, టిజిసిజిటిఏ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ కళాశాల, అధ్యాపక బృందం అభినందనలు తెలిపారు.

మైనారిటీ గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల కమిటీ ఎన్నిక

తిమ్మాపూర్, ఫిబ్రవరి6: మండలంలోని మానకొండూ ర్ మైనారిటీ గురుకుల కళాశాలలో ఆర్ట్ టీచర్‌గా విధు లు నిర్వర్తిస్తున్న రెవోజు స్వామి యుటీఎఫ్ సంఘం తరుపున ఉమ్మడి కరీంనగర్ జిల్లా మైనారిటీ గురుకుల పాఠశాలల ఉపాధ్యాయుల కమిటీ ఉపాధ్యక్షులుగా ఎన్ని కైనట్లు పాఠశాల ప్రినిపాల్ పి.సంపత్ తెలిపారు. ఈ సందర్భంగా రెవోజు స్వామిని ప్రినిపాల్ పి.సంపత్‌తో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండలాధ్యక్షుడిగా శ్రీనివాస్

గంగాధర, ఫిబ్రవరి 6: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం గంగాధర మండలాధ్యక్షుడిగా పొన్నాల శ్రీనివాస్ నియమాకమయ్యాడు. ఈమేరకు మంగళవారం జిల్లా ఫోరం అధ్యక్షుడు కనకం కుమార స్వామి నియమాక పత్రాన్ని అందించారు. తన నియమాకానికి సహకరించిన జిల్లానియోజకవర్గతెలంగాణ ఉద్యమకారులందరికి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలి

వీణవంక ఫిబ్రవరి6: ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని ప్రిన్సిపాల్ డా.రాజశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, తెలంగాణ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులను అధ్యాపకులను కలిసి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వసతులను వివరించారు. కళాశాలలో బీఏహెచ్‌ఈపీ, బీఏ, బీఎస్సీ క్రాప్ ప్రొడక్షన్, బీజడ్‌సీ, బీకాం కంప్యూటర్స్ అప్లికేషన్స్, బీఎస్సీ డెయిరీ కోర్సులు అందిస్తున్నట్లు తెలిపారు. దోస్త్ ద్వారా పేర్లు నమోదు చేసుకుని కళాశాలలో చేరాలని కోరారు. ఈ కార్యక్రమములో అధ్యాపకలు డా. రాంమోహన్ రావు, రేణ ఈశ్వరయ్య, స్వరూపరాణి, రవీందర్ ఉన్నారు.